
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
8-8-2026 (Saturday)
MAIN EDITION

## పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ సాయం



**అక్షరటుడే, హైదరాబాద్:** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన కుటుంబానికి బీఆర్ఎస్ అండగా నిలిచింది. పెద్ది కుటుంబానికి కేసీఆర్ రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం ప్రకటించారు. ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి సాయం చేయాలని, ఆయన తల్లి అమృతమ్మకు రూ.25 లక్షలు ఇవ్వాలని నిర్ణయించారు. పిల్లల చదువు, భవిష్యత్తుపై పార్టీదే బాధ్యత అని పేర్కొన్నారు.

## వైసీపీపై చంద్రబాబు విమర్శలు



**అక్షరటుడే, ఏపీ :** వైసీపీ దీక్షలపై సీఎం చంద్రబాబు పరోక్ష వ్యాఖ్యలు చేశారు. చట్ట వ్యతిరేకంగా పని చేస్తే సహించమన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టే నిరసనలను అంగీకరించమని స్పష్టం చేశారు. బస్టాండ్, రహదారులపై నిరసనలు చేస్తే ఊరుకోమన్నారు. వైసీపీ రిలే దీక్షల్లో రౌడీలు తప్ప.. ఒక్క డీఎస్సీ అభ్యర్థి లేరన్నారు. కర్నూల్‌లో నిరసన చేపట్టిన వారంతా డీఎస్సీ ఉద్యోగాలకు ఎంపికైన టీచర్లే అన్నారు. గొడ్డలి పార్టీ చేసిన నష్టం వల్లే టీచర్లు తమ ఆత్మగౌరవం చాటుకున్నారని బాబు పేర్కొన్నారు.

## బోనం ఎత్తిన నిహారిక



**అక్షరటుడే, సినిమాడెస్క్:** మెగా ఫ్యామిలీ హీరోయిన్ నిహారిక కొనిదెల బోనం ఎత్తారు. పాతబస్తీ మీరాలం మండిలోని మహంకాళేశ్వర ఆలయంలో సినీ నటి, నిర్మాత నిహారిక బంగారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెతో భక్తులు ఫొటోలు దిగారు.

## ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి



**అక్షరటుడే, హైదరాబాద్:** బీజేపీ కార్యకర్తలు ఎస్ఐఆర్ ప్రక్రియలో అహర్నిశలు శ్రమిస్తూ అర్హుల పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా కృషి చేస్తున్నారని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. అనుమానాస్పద, అనర్హుల ఓట్లు నమోదు కాకుండా పరిశీలించాలని ఆయన సూచించారు.


## మిడ్ మానేరు గేట్లు ఎత్తివేత



**అక్షరటుడే, సిరిసిల్ల:** మిడ్ మానేరు ప్రాజెక్ట్ గేట్లను అధికారులు ఎత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని గాయత్రి పంప్ హౌస్ నుంచి వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు గోదావరి జలాలను తరలిస్తున్నారు. ప్రాజెక్ట్ నిండుకుండలా మారడంతో 4 గేట్లు ఎత్తి లోయర్ మానేరుకు నీటి ని తరలిస్తున్నారు.

## శ్రీశైలంకు కొనసాగుతున్న వరద

**అక్షరటుడే, శ్రీశైలం:** శ్రీశైలం జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువన వర్షాలు కురుస్తుండటంతో వరద వస్తోంది. కర్ణాటకలోని ఆల్మటి జలాశయానికి శుక్రవారం సాయంత్రంతో పోలిస్తే నీటి ప్రవాహం 7,374 క్యూసెక్కులు పెరగగా, అవుట్‌ఫ్లో 18,155 క్యూసెక్కులు పెరిగింది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 1,15,874 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 70,655 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల నిండుకుండలా మారడంతో అధికారులు 32 గేట్లను ఎత్తారు. దీంతో శ్రీశైలం ప్రాజెక్ట్‌లోకి ప్రస్తుతం 2,32,308 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 66 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.



## హైదరాబాద్‌లో భారీ అగ్ని ప్రమాదం

**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బంజారా హిల్స్ రోడ్ నంబర్ 11లోని బీఆర్కే న్యూస్ భవనం సెల్లార్‌లో మంటలు చెలరేగాయి. దారువాలా వైన్ మార్ట్ స్టాక్ స్టోరేజీలో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. దీంతో పొగలు రావడంతో గమనించిన స్థానికులు వెంటనే అగ్ని మాపక సిబ్బంది సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది మూడు ఫైరింజన్‌లతో మంటలను ఆర్పివేశారు.

**ప్రస్తుతం సమాజం వేగంగా మారుతోంది. యువత ఆధునిక, పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నగరంలో కొత్త తరహా ట్రెండ్ వెలుగులోకి వచ్చింది. రెంట్‌కు బాయ్‌ఫ్రెండ్ పేరిట పలువురు ఒంటరి యువతులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. యాప్‌లు, సోషల్ మీడియాల్లో ప్రకటనలు ఇచ్చి.. మోసాలకు పాల్పడుతున్నారు.**

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి




# రెంట్‌కు బాయ్‌ఫ్రెండ్!

- ఒంటరి యువతులే లక్ష్యం
- హైదరాబాద్‌లో కొత్త తరహా మోసం
- జాగ్రత్తగా ఉండాలన్న సీపీ

ఒంటరితనంతో బాధపడుతున్నారా? మీతో కాఫీ తాగడానికి, సినిమాకెళ్లడానికి అందమైన అబ్బాయి కావాలా? అది కూడా 50 శాతం ఆఫర్లతో!.. సోషల్ మీడియాలో రకరకాల ఆఫర్ల పేరుతో కలర్‌ఫుల్‌గా కనిపిస్తున్న ఈ పోస్టర్ల వెనుక పెద్ద సైబర్ మోసం దాగి ఉంది. ప్రత్యేకంగా అమ్మాయిలు, యువతులే లక్ష్యంగా సైబర్ కేటుగాళ్లు విసురుతున్న కొత్త డేటింగ్ ట్రాప్ ఇది. ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ వేదికలుగా రెంట్ బాయ్‌ఫ్రెండ్ యువర్ పర్సనల్ కంపానియన్ అంటూ రకరకాల డిస్కౌంట్ ప్యాకేజీలతో కూడిన పోస్టర్లను నెట్టింట ప్రచారం చేస్తున్నారు.

### బుకింగ్స్ పేరిట బురిడీ

ఆకర్షణీయమైన కుర్రాళ్ల ఫోటోలు ప్రదర్శిస్తూ.. ఒక గంట కాఫీ మీటింగ్‌కు రూ.499, సినిమా డేట్‌కు రూ.1,249, ఈవెంట్లు లేదా పెళ్లిళ్లకు తోడుగా వచ్చేందుకు రూ.1,999, అలాగే 10 గంటల ఫుల్ డే ప్యాకేజీకి రూ.4,499 అంటూ కేటుగాళ్లు ప్రచారం చేస్తున్నారు. ఎవరికీ తెలియకుండా గోప్యత, భద్రత పాటిస్తామని, ఎటువంటి అక్రమ వ్యాపారం కాదని నమ్మబలుకుతూ బుకింగ్స్ కోసం డైరెక్ట్ మెసేజ్ చేయాలని కోరుతున్నారు. ఏఐతో సృష్టించిన లేదా ఇంటర్నెట్ నుంచి సేకరించిన హ్యాండ్సమ్ కుర్రాళ్ల ఫోటోలను ప్రొఫైల్ పిక్చర్లుగా పెట్టి, మెసేజ్ చేసిన అమ్మాయిలతో తియ్యటి మాటలతో సంభాషణలు మొదలు పెడుతున్నారు. బుకింగ్ కన్ఫర్మేషన్, సెక్యూరిటీ డిపాజిట్, అడ్వాన్స్ అమౌంట్ పేరుతో డిజిటల్ వ్యాలెట్లు, క్యూఆర్ కోడ్ల ద్వారా వేలాది రూపాయలు వసూలు చేసి, ఆపై అకౌంట్లను బ్లాక్ చేస్తున్నారు.

### బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడే అవకాశం

ఆన్‌లైన్ సంభాషణలు నమ్మి అపరిచిత వ్యక్తులను నేరుగా కలవడానికి వెళ్తే వారు మిమ్మల్ని సులభంగా ట్రాప్ చేసే ప్రమాదం ఉందని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ప్రేమ పేరుతో అబద్ధాలు చెప్పి మోసం చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. చాటింగ్ క్రమంలో చాకచక్యంగా సేకరించిన ఫోన్ నంబర్లు, వ్యక్తిగత ఫోటోల ఆధారంగా ఆ తర్వాత బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ రకమైన మోసపూరిత ప్రకటనలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం దృష్టిసారించిందన్నారు. ఈ విషయంలో అమ్మాయిలతో పాటు వారి తల్లిదండ్రులు కూడా అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

## జీవితం చాలా పరీక్షలు పెడుతుంది



**అక్షరటుడే, ఢిల్లీ :** ఢిల్లీ ఐఐటీ స్నాతకోత్సవంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. విద్యార్థులకు గ్రాడ్యుయేట్ పట్టాలు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. మన యువతను చూస్తే గర్వకారణంగా ఉందన్నారు. భవిష్యత్ భారత్ నిర్మాతలు వారేనని పేర్కొన్నారు. దేశ స్వప్నాన్ని యువత సాకారం చేస్తుందని ప్రధాని మోదీ అన్నారు. జీవితం చాలా పరీక్షలు పెడుతోందని, అన్నింటిలో నెగ్గాలని సూచించారు. ఎన్ని కష్టాలు వచ్చినా అనుకున్న లక్ష్యం సాధించాలన్నారు. ప్రతి తరానికి ఆయా కాలాలకు సంబంధించిన ప్రత్యేక సవాళ్లు ఉంటాయని, అలాగే వారిపై నిర్దిష్టమైన జాతీయ బాధ్యత ఉంటుందన్నారు.


## నిరుద్యోగులపై ప్రభుత్వం కక్ష: హరీశ్‌రావు



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** విద్యార్థులు, నిరుద్యోగులు అంటే ప్రభుత్వానికి ఎందుకు ఇంత కక్ష అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను నెత్తిన పెట్టుకున్న కాంగ్రెస్.. ఇప్పుడు ఉద్యోగాల కోసం రోడ్ల మీదకు వస్తే వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా అన్నారు. హైడ్రాలో 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేలాది మంది నిరుద్యోగులు తరలి వచ్చారు. దీంతో సరూర్ నగర్ స్టేడియంలో తోపులాట చోటు చేసుకుంది. నిరుద్యోగులతో అధికారులు దురుసుగా ప్రవర్తించారు. దీనిపై ఎక్స్ వేదికగా హరీశ్‌రావు స్పందించారు. నిరుద్యోగులపై అనుచితంగా, అసభ్యంగా మాట్లాడిన అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఐఏఎఫ్ అధికారి హనీట్రాప్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారత వైమానిక దళానికి చెందిన ఒక వింగ్ కమాండర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతనిపై అధికార రహస్యాల చట్టం కింద కేసు నమోదు చేశారు. అతడు హానిట్రాప్‌కు గురై భారత సైన్యం, జాతీయ భద్రతకు సంబంధించిన వ్యూహాత్మక సమాచారాన్ని పాకిస్తాన్‌కు చేరవేశాడు. సదరు వింగ్ కమాండర్ సోషల్ మీడియాలో ఒక మహిళతో చాటింగ్ చేయడం ప్రారంభించారు. అనంతరం వారి పరిచయం వీడియో కాల్స్ వరకు వెళ్లింది. తర్వాత ఆమె సైనిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని అడగడం ప్రారంభించింది. ఆ మహిళ పాకిస్తానీ గూఢచార సంస్థ కోసం పనిచేస్తోందని, ఆ అధికారి హనీ ట్రాప్‌కు గురయ్యాడని పోలీసులు అనుమానిస్తున్నారు.



## ప్రైవేట్ బస్సు బోల్తా.. 8 మంది మృతి

**అక్షరటుడే, హిమాచల్ ప్రదేశ్:** హిమాచల్ ప్రదేశ్‌లోని చంబా జిల్లాలో శనివారం ఉదయం ఒక ప్రైవేట్ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, కండక్టర్‌తో సహా ఎనిమిది మంది మృతి చెందగా, మరో 10 మంది గాయపడ్డారు. బైరాగఢ్‌టిస్సా రహదారిపై దేవికోఠి ప్రాంతంలోని చలుంజ్ మోర్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. శర్మ బస్ సర్వీస్‌కు చెందిన ఈ బస్సు బైరాగఢ్ నుంచి చంబాకు ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం 6:30 గంటల ప్రాంతంలో బైరాగఢ్ నుంచి బయలుదేరిన బస్సు ప్రమాదానికి గురైందని అధికారులు తెలిపారు. ఆ సమయంలో బస్సులో 18 మంది ప్రయాణిస్తున్నారు. అధికారుల ప్రకారం, వాహనం బోల్తా పడి కింద ఉన్న రోడ్డుపై పడటంతో, పలువురు ప్రయాణికులు బస్సు శిథిలాల కింద చిక్కుకుపోయారు.



## సరూర్ నగర్ స్టేడియం వద్ద తోపులాట



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ నగరంలోని సరూర్ నగర్ స్టేడియంలో శనివారం తోపులాట చోటు చేసుకుంది. హైడ్రాలో ఒప్పంద ప్రతిపాదికన పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ విడుదల అయింది. 100 డీఆర్ఎఫ్ అసిస్టెంట్లు, 50 డ్రైవర్ పోస్టులు భర్తీ చేస్తామని అధికారులు తెలిపారు. శనివారం ఉదయం నుంచే నిరుద్యోగులు పోటెత్తారు. భారీగా నిరుద్యోగులు రావడంతో ఉద్రిక్తత నెలకొంది. ఇంత మంది వస్తే ఈవెంట్స్ ఎలా నిర్వహిస్తామని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఫేక్ పనీర్‌పై బ్యాన్



**అక్షరటుడే, ఉత్తరాఖండ్:** నకిలీ పనీర్‌పై ఉత్తరాఖండ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. స్వచ్ఛమైన పాలకు బదులుగా కూరగాయల నూనెలు, పిండి పదార్థాలు, రసాయనాలను ఉపయోగించి తయారు చేసిన పనీర్, నెయ్యి, వెన్నతో సహా నాసిరకం పాల, నకిలీ పాల ఉత్పత్తుల తయారీ, నిల్వ, రవాణా అమ్మకాలను నిషేధించింది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం కింద విధించిన ఈ నిషేధం రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే అమల్లోకి వచ్చింది. వినియోగదారులను తప్పుదోవ పట్టించే అవకాశం ఉన్న నకిలీ పాల ఉత్పత్తులపై నిషేధం వర్తిస్తుందని అధికారులు తెలిపారు.

## రష్యాపై ఆంక్షల బిల్లుకు అమెరికా ఆమోదం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** రష్యాపై ఆంక్షల బిల్లుకు అమెరికా సెనేట్ ఆమోదం తెలిపింది. రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై కఠిన ఆంక్షలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో భారత్, చైనాపై ఎక్కువగా ప్రభావం చూపే అవకాశం ఉంది. రష్యాను, దాని పెట్రోలియం ఉత్పత్తుల ప్రధాన కొనుగోలుదారులైన భారత్, చైనాలతో సహా ఇతర దేశాలను శిక్షించే లక్ష్యంతో రూపొందించిన ఒక బిల్లును అమెరికా సెనేట్ ఆమోదించింది. రష్యా నుంచి చమురు, గ్యాస్‌ను దిగుమతి చేసుకునే మొదటి ఐదు దేశాల వస్తువులపై 100 శాతం సుంకాలు విధించే అధికారాన్ని ఈ బిల్లు డొనాల్డ్ ట్రంప్‌కు కల్పిస్తుంది.

